"ఇప్పుడే వచ్చారు. వెంటనేవెళ్ళి అడిగితే ఏమనుకుంటారో. అయినా వెళ్ళిచూడండి. యీ వాళ అర్జంటుగా కాయితాలన్నీ పడేశారుకదూ"

"అర్జంట్లన్నీ అయిపోయాయండి"

"సరే వెళ్లు" అన్నాడు హెడ్‌గుమాస్తా.

బంట్రోతు అప్పలస్వామినిపిలచాడు సంజీవయ్య.

"అయ్యగారు ఏంచేస్తున్నారోయ్"

"పేపరు చూస్తున్నారు"

"ఎలాగున్నారు"

"బాగానే ఉన్నారు"

"కోపంగా లేరు గద"

"లేదులెండి"

"ఒకసారి నేను వారిదర్శనం చేస్తానని చెప్పు"

అప్పలస్వామి వెళ్ళివచ్చి "రమ్మంటున్నారు వెళ్ళండి" అన్నాడు.

జంకుతూ జంకుతూవెళ్లి నమస్కారంచేసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

'What is the matter' అన్నాడు ఆఫీసరు సంజీవయ్య వైపుచూసి తిరిగి న్యూస్ పేపరు చూసుకుంటూ.

'యీవాళ యింటిదగ్గర కొద్దిగా పనుందిసార్ కాస్త త్వరగా యింటికి వెళ్లడానికి శలవు యిప్పిస్తారని మనవిచేస్తున్నాను'

'హుఁ' అన్నాడు ఆఫీసరు.

'చిత్తం' అన్నాడు సంజీవయ్య.

'నేను యిక్కడ వున్నప్పుడు మీరందరూ వుంటే నాలుగు కాయితాలూ చూసుకోవచ్చునని నేను చెపితే ఏదో సాకుపెట్టుకుని యిలా చేస్తే ఎలాగ' అన్నాడు.

సంజీవయ్య ఏమీ జవాబు చెప్పలేదు.

'సరే వెళ్ళండి. వెళ్ళండి'

'శలవ్' అనుకుంటూ నమస్కారంచేసి యింటికి బయలుదేరాడు కళింగయుద్ధం జయించిన అశోకుడిలా అతనిలో విజయగర్వంలేదు.

యింటికి వస్తున్నాడన్న మాటేగాని 'సరే వెళ్లండివెళ్లండి'అన్న ఆఫీసరుమాటలు మామూలుగా వెళ్ళమనో లేక సరేవెళ్లు నీసంగతిచూస్తాను అన్న అర్థంతో అన్నవో అర్థంకాలేదు సంజీవయ్యకి.

అంతర్ముఖుడి స్వగతం

# లెఖ్ఖలు చెప్పే నేను

బందా వెంకటసుబ్బారావు

**THE real resources ultimately will be the bright young men, people with a sense of dedication to their work, to the search for truth, to the discovery of the secrets of the universe for the public good.**

**—Jawaharlal Nehru.**

చుట్టూ ఆవరించిన చీకటిని చీల్చిమెరిసే వెలుగు రేఖవంటిది పైవాక్యం. అందునా, ఎదుగు బొదుగులు లేకుండా, ఎడతెరపి లేకుండా, పాడిందేపాడుకుంటూ, చెప్పిందే చెప్పుకుంటూ, కొద్ది మందికి రుచించినా చాలమందికి గగుర్పాటు కలిగించే పచ్చికాకరకాయ లాంటి సబ్జక్టు చెప్పుకునే లెక్కలమేస్టరు జీవితానికి ఒక ఆలంబనము. అందరు మేస్టర్లలోను యీతడిదొక ప్రత్యేక ప్రకృతి. దుక్కలాంటి లెఖ్ఖలమేస్టరు చాలా దుర్లభుడు. ఉస్సురంటూ బక్కచిక్కి, గొరగని గడ్డం, మార్చని బట్టలు, ఏమిటో గొణుక్కుంటూ, ఏవో అలౌకికమైన వాట్లయందు లగ్నమైన ధ్యానముద్రను తెలిపే నేత్రద్వయంతో ఫలానా అని చెప్పకయే చెపుతుంది అతడి వేషం. హాస్యరసంతోనూ ఉపాఖ్యానాలతోనూ హరికథలా కాలక్షేపం చేయడానికి వీలులేని విషయాన్ని బోధించుట చేతనూ, అర్హతగల స్టెప్పులేకుండా అరమార్కైనా అదనంగా ఆశ్రితులకు అనుగ్రహించక పోవుటచేతనూ, అర్థిజన కుముదములకు అరుణోదయంలాంటివాడని, నిర్దయుడని, పిల్లలులేనివాడని (గంపెడున్నా), అపవాదులకు పాల్పడుతుంటాడు. అలాంటివాని జీవితం ఒక నిష్కామసేవగా, మానవసంఘాన్ని ముందుకునడిపే మహామహులను సృష్టించే కర్మరంగంగా చిత్రించేవాక్యం అది.

"అది పలుకబడిన సందర్భాన్ని, సన్నివేశాన్ని చూస్తే ఎందుకలా అనుకోవాలో యింకా బోధపడుతుంది. అణుశక్తిని శాంతియుత ప్రయోజనములకు ఎట్లు ఉపయోగించాలో ఆలోచించేందుకు ఆహూతులైన అఖిలభారత యువసైంటిస్టులను ఉగ్గడిస్తూ నెహ్రూపల్కిన పల్కులవి. ఇంతటి నెహ్రూకూడా ఒక్కమాటలో వెల్తిపడిపోయి లెఖ్ఖల మేస్టరుకంటె తక్కువైపోయాడు.

"నాకు లెఖ్ఖలు రావుగనుక యీయువసైంటిస్టులు చెప్పింది అర్థంకాకపోయినా, వారిముఖాలను చూచి వారిలో వికసించే ధైర్యోత్సాహములను గ్రహించగలిగాను" అన్నారు. అంటే లెఖ్ఖలు రావు గనుక తెల్లమొగ మేసుకొని వారి మొగములవంక చూచారన్నమాట. ఇది చదివి ఓ లెఖ్ఖల మేస్టరు "భళిరా! ఎంతటి వాడవోయి" అని తన వీపుతానే తట్టుకుంటే తప్పేమిటి? అంతే కాదు, "తగన్‌భావించి" యిలాంటి లంకెల గొలుసును పెంచుకొని తనను ఆ తరుణ తారాగణంతో తగిలించుకొంటే మాత్రమేం?

"భారత దేశమేమిటి, మానవజాతి అభ్యుదయమే యాటమును లొంగదీయటం మీద ఆధారపడియున్నది. యాటంను చెవిమెలిపెట్టి దానికడుపులో రహస్యాలను యే కరువు పెట్టించేశక్తి యెవరికుంది? గణితశాస్త్ర పారంగతులైన వారికుంది. అటువంటి యువకులను తయారు చేసేశక్తి యెవరికుంది? లెఖ్ఖల మేస్టరుకుంది. కనుక భావి భాగ్యోదయ మంతా నా గుప్పిడిలోని. చాక్‌పీసు మీద ఆధారపడిఉన్నది. ఇందుకు ప్రబలనిదర్శనం కావాలంటారా? డాక్టరు ఫెర్మియొక్క పటం చూడండి (డిసెంబరు 10 స్వతంత్రలో) నల్లబల్ల మీద సుద్దముక్కతో నా ఎల్లిప్సులు, నా ఆల్ఫాలు నాతీటాలు వేస్తున్నాడు. యాటంయొక్క రహస్యాలను గణిత సాంకేతికముల మూలమున తెలిసికొనగలుగుతున్నాడు. సంస్కృతమును దేవభాష అంటారుగాని, యిది పచ్చి అబద్ధం. దేనికైనా దేవభాష అని పిలవబడు అర్హతఉన్నదా అంటే అది గణితం. సృష్టి తన రహస్యాలను ఆ భాషలోనే చెపుతుంది. ఆ భాష వచ్చినవారే దానిని అర్థం చేసుకోగలుగుతున్నారు. చూడడానికి పిచ్చిగీతల లాగుంటుంది. బ్యాండు మేస్టరుముందు సంగీత సాంకేతికములుగల కాగితమునుచూచి మనం పిచ్చిగీతలనుకుంటే మాత్రమేం? వానికవి మృదుమధుర నినదముల చిహ్నములు. అట్లే యీ విశ్వవిపంచి చేయు మధురాలాపనలకు స్వరములు నా ఆల్ఫాలు, తీటాలు, ఎక్సులు, వైలు. ఎంతమందికి నేను దీనియందు అభిరుచి కలిగించి బోధించితే అంతమందిని పరమపద సోపానములను ఎక్కించిన వాడనవుతాను. ఎంతమందికి దీనియందు చిన్నప్పుడే వెగటుపుట్టించి విముఖులను చేస్తానో అంతమందికి శాశ్వతంగా అట్టి అవకాశములను పోగొట్టిన పుణ్యంకట్టుకుంటాను. ఇంతటి మహత్కార్యం నా భుజస్కందములమీద ఉన్నది. నాపనికి విలువ రూపాయలలో ఎవరు కట్టగలరు? ఓ ముష్టి వందరూపాయిలు వీళ్లు యిస్తేఎంత ఇవ్వకపోతే ఎంత? గణిత బోధయే నా జీవిత పరమావధి.

నా గణితంలో ఏ శాస్త్రంలోలేని విశిష్ఠ లక్షణమొకటుంది. ఇది బ్రహ్మవిద్యలాంటిది. బ్రహ్మవిద్య నేర్చినవాడు జీవబ్రహ్మైక్యమును పొందునపుడు ఎట్టి ఆనందమును పొందుతాడో, అట్టి ఆనందమునే నారికేళంలాంటి లెఖ్ఖను బద్దలుగొట్టి ఆన్సరు కనుక్కోగానే మానవుడు అనుభవిస్తాడు. ఉపాసకుడి మనస్సు ఉపాసనామూర్తియందు ఎంతగా లగ్నమవుతుందో జామెట్రీరైడరు ఆలోచించేప్పుడు ఆ రేఖాచిత్రంమీదకూడా నామనస్సు అంతగా లగ్నమయి వుంటుంది. "ప్రాసాదేసా, పథిపథిచసా, పృష్ఠతస్సా, పురస్సా, పర్యంకేసా, దిశిదిశిచసా" అన్నట్లు అద్వైత భావం చెంది నిద్రలోనూ అన్నంతింటున్నా, ఏంచేస్తూన్నా జామెట్రీ రైడరుబొమ్మ మనోనేత్రంముందు కట్టినట్లుంటుంది. నిజంచెపితే నవ్వుతారేమో! రెండు అహోరాత్రములు ఆలోచించినా దృగ్గోచరంకాని రైడరుకు సొల్యూషను మూడోనాడు ప్రొద్దున్నే లేచీలేవగానే చటుక్కునతట్టేది. అసలు అంతర్ముఖుడికిగాని లెఖ్ఖలురావు. ఈ ధ్యాస ఎంత ఎక్కువగా ఉంటుందంటే ఒకొక్కప్పుడు మా ఆవిడ నాకు పిచ్చెక్కిందనుకుంటుంది. పిల్లలు సమీపంలో ఎంతగోడవచేసినా నాకు వినపడదు. కాబట్టి మనోనిగ్రహం ఆత్మశక్తిని యిచ్చే బ్రహ్మవిద్యలాంటిది నాగణితం. నేను ఋషిసాంప్రదాయంలో వాణ్ణి. ఒట్టి లెఖ్ఖల మేష్టర్ని కాదు. ★